## క్లుప్తంగా

### ఎమ్మెల్యేకు వినతి



**అలంపూర్:** హోలీయ దాసరుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం అలంపూర్ చౌరస్తాలో ఎమ్మెల్యే వీఎం అబ్రహంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ హోలీయ దాసరుల సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ హోలీయ దాసరులకు దళితబంధు పథకం వర్తింపజేయాలని కోరారు. కుల ధృవీకరణ పత్రాలు డివిజనల్ అధికారి నుంచి కాకుండా తహసీల్దార్ ద్వారా జారీ చేసేందుకు చొరవ చూపాలని పేర్కొన్నారు. గ్రామాల్లో హోలీయ దాసరుల కమ్యూనిటీహాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రాముడు, కౌన్సిలర్ ఆంజనేయులు, సర్పంచ్ భద్రప్ప, బుడగ జంగాల సంఘం జిల్లా అధ్యక్షుడు మారెప్ప, ఆంజనేయులు, తిమోతి, మల్లికార్జున్, శివన్న, చిన్న ఉరుకుందు పాల్గొన్నారు.

### జడ్పీ చైర్‌పర్సన్‌కు మద్దతు



**గద్వాల రూరల్:** బీఆర్ఎస్‌కు చెందిన జడ్పీ చైర్‌పర్సన్ కె.సరిత త్వరలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్న నేపథ్యంలో గద్వాల మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సోమవారం జిల్లా కేంద్రంలో ఆమెను కలిసి మద్దతు తెలిపారు. పూడూరుకు చెందిన మాజీ ఎంపీటీసీ ఈశ్వర్, శెట్టిఆత్మకూరు మాజీ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, లక్ష్మణ్ తన అనుచరులతో కలిసి సరితను కలిశారు. వీరందరితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు సరిత ప్రకటించారు.

### రాజ్యాధికారమే లక్ష్యంగా పని చేయాలి



**ధరూరు:** బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా పని చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు గోవిందు అన్నారు. మండలంలోని నెట్టెంపాడులో సోమవారం గ్రామ కమిటీ సభ్యులతో భవిష్యత్ రాజకీయ సమీకరణలపై చర్చించారు. త్వరలో బూత్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లప్ప, శివన్న, నాగేష్, లింగప్ప, మల్లేష్, సహదేవ్, రమేష్, వెంకటన్న, లాలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీలో చేరిక



**శాంతినగర్:** అలంపూర్ నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు సోమవారం మండల కేంద్రంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటిక్యాల మండలం షాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ ఎంపీటీసీ రాముడు, పలువురు యువకులతోపాటు అయిజ మండలం ఎక్లాస్‌పురం గ్రామానికి చెందిన యువకులు కాంగ్రెస్‌లో చేరగా, సంపత్‌కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

**పార్టీ నుంచి తొలగింపు**

**అయిజ:** కాంగ్రెస్ యూత్‌మండల అధ్యక్షుడు ముని నాయుడిని పార్టీ నుంచి తొలగించినట్లు మండల అధ్యక్షుడు జయన్న సోమవారం ప్రకటనలో తెలిపా రు. పార్టీ అంతర్గత వ్యవహారాల పరిశీలన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

### గ్రామదేవతలకు అభిషేకం



**ఉండవెల్లి:** మండలంలోని ప్రాగటూరులో వర్షాల కోసం సోమవారం గ్రామస్తులు కృష్ణాజలాలను తీసుకొచ్చి గ్రామదేవతలకు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చిన్న ఆముదాలపాడులో కప్పమ్మను ఊరేగించి శివుడికి 101 బిందెలతో నీటితో అభిషేకం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తక్కశీలలో ఉమారామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

# ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**మల్దకల్:** సోమవతి అమావాస్యను పురస్కరించుకొని సోమవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు మధుసూదనాచారి, రవిచారి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆదిశిలా క్షేత్రం చరిత్రను హరికథ రూపంలో ఆంజనేయులు భక్తులకు వివరించారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్పస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గద్వాల కాకతీయ టెక్నోస్కూల్ యజమాన్యం ఆదిశిలా క్షేత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యశ్చంద్రారెడ్డి, నాగరాజుశర్మ, బాబూరావు, చంద్రశేఖర్‌రెడ్డి, నరేందర్ పాల్గొన్నారు.

**రాజోళి:** మండల కేంద్రంలోని వైకుంఠ భ్రమరాంబ అదివేశ్వరస్వామి ఆలయంతోపాటు వైకుంఠ నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలోని అంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి బిందెసేవ, ఆకుపూజ, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**శాంతినగర్:** వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని పలు ఆలయాల్లో పంచామృతాభిషేకాలు, బిల్వార్చన, శివాష్టకం పూజలు జరిపించారు. శివ పంచాక్షరి మంత్రాన్ని జపిస్తూ నారికేళాలు, ఫలపుష్పాలు, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా శివనామస్మరణ మార్మోగింది. జూలెకల్ శివాలయంలో అర్చకులు సాయినాథ్‌శర్మ, రామలింగయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎస్.శారద, మద్దిలేటి దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



వెంకటాపురం పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

**గట్టు:** మండల కేంద్రంలోని గండి ఆంజనేయస్వామి, మాచర్ల చెన్నకేశవస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

**కేటీదొడ్డి:** అమావాస్య సందర్భంగా మండలంలోని వెంకటాపురం పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయం వద్ద పలువురు దాతలు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

**మానవపాడు:** మండల కేంద్రంతోపాటు చెన్నిపాడు, అమరవాయి, కలుకుంట్ల, నారాయణపురం, బోరవెల్లి, జల్లాపురం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయ స్వామికి అభిషేకాలు, ఆకుపూజ నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

**ఉండవెల్లి:** మండలంలోని డి.బూడిదపాడు, అలంపూర్ చౌరస్తాలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో అమావాస్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ఆకుపూజ చేశారు. మధ్యాహ్నం సీతారాముల ఉత్సవమూర్తులకు పల్లకీసేవ నిర్వహించారు. డి.బూడిదపాడు ఆలయంలో నల్గొండకు చెందిన మిషన్ భగీరథ సూపర్‌వైజర్ శేఖర్‌రెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

**ధరూరు:** మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంతోపాటు కోతులగిద్ద అరణ్ణేశ్వరస్వామి, పెద్ద చింతరేవుల, అల్వలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అర్చకులు మద్వాచార్యులు, కిష్టాచార్యులుతోపాటు శ్రీనివాసరావు, నర్సింహులు, మాజీ సర్పంచులు రంగన్న, రంగప్ప, రామయ్యశెట్టి పాల్గొన్నారు.



రాజోళి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



గట్టు గండి ఆంజనేయస్వామి ఆలయంలో..



పెద్దచింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో..



డి.బుదిదపాడులో ఆంజనేయస్వామి పల్లకీసేవ



జూలెకల్ శివాలయంలో అన్నదానం



కోతులగిద్దలో భక్తులకు అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

### శుభ్రత అందరి బాధ్యత

**మల్దకల్:** పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సర్పంచ్ పద్మమ్మ అన్నారు. మండలంలోని బూడిదపాడు, అమరవాయి గ్రామాల్లో సోమవారం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వానాకాలం దృష్ట్యా పారిశుద్ధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు డ్రెయినేజీలను శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సరోజ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతో ఆరోగ్యం

**మల్దకల్:** పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ స్వరూపరాణి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు మంచి పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రత పాటించి ప్రతినెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, సత్యమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

### చౌడేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాలు

**ఆత్మకూర్:** తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవం చౌడేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు సోమవారం ప్రముఖ వేదపండితుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండలంలోని తిప్పుడంపల్లిలో ఉదయం 6గంటల నుంచి మొదలుకొని చౌడేశ్వరి ఆలయంలో జలాభిషేకం, పంచామృతభిషేకం, సహస్ర కుంకుమార్చన ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. భజన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహన కమిటీ అధ్యక్షుడు బలరాం, నాయకులు పెరుమాళ్ల బాలరాజు, సత్యన్న, ఈశ్వరయ్య, పెరుమాళ్ల సత్యన్న ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

**రాజోళి:** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 20నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని మెడికల్ ఆఫీసర్ మధుబాబు వైద్యసిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీపై అవగాహన కల్పించారు. మండలంలో 1–19 సంవత్సరాల వయస్సుగల వారు 9,440 మంది ఉన్నారని, వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేసేందుకు సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. ఇద్దరు హెల్త్ సూపర్‌వైజర్లు, ఇద్దరు హెల్త్ అసిస్టెంట్లు, 12మంది ఏఎన్ఎంలు, 33 మంది ఆశ కార్యకర్తలు, 36 మంది అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయప్రకాష్, రంజిత్‌కుమార్, రామకృష్ణ, హెలెన్, మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మధుబాబు

## రైతుబంధు ఇంకెప్పుడిస్తారు?

**అయిజ:** వర్షాకాలం ప్రారంభమై నెలరోజులు గడుస్తోందని, రైతుబంధు డబ్బులు ఇంకెప్పుడిస్తారని బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 5 ఎకరాల వద్ద రైతుబంధు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం దివాలా తీయడంతోనే ప్రజలకు పథకాలు అందడంలేదన్నారు. వెంటనే రైతులందరికీ రైతుబంధు అందజేయాలని, కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం చేయాలని చూస్తే బీజేపీ తరపున రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్సీమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాధన్న, మండల ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, బీజేవైఎం ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, వాణిజ్యసెల్ కన్వీనర్ కృష్ణ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్

## కార్మికుల పోరాటం ఉధృతం

**అలంపూర్:** పంచాయతీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహ అన్నారు. అలంపూర్ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం కొనసాగింది. కార్మికులకు ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆశన్న మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్ మద్దిలేటి, అఖిల్, మద్దిలేటి, మహేష్, శివానంద్, సురేష్ పాల్గొన్నారు.

**గట్టు:** పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగింది. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో పలువురు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.19,500 ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

**శాంతినగర్:** వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ అన్నారు. వడ్డేపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దుతు తెలిపారు. శాంతినగర్‌లో ఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ నాయకులు ర్యాలీ నిర్వహించారు.

**మల్దకల్:** ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 12వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు వంటావార్పు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోపాల్, పురుషోత్తం, కిష్టన్న పాల్గొన్నారు.



గట్టులో నిరసన తెలియజేస్తున్న కార్మికులు



**ఘనంగా బోనాల వేడుక**

**ఉండవెల్లి/ఎర్రవల్లిచౌరస్తా:** ఉండవెల్లి మండలంలోని కలుగోట్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి సరస్వతి పాఠశాలలో సోమవారం బోనాల వేడుకను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన బోనాలతో విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

### ఆర్థికసాయం అందజేయాలి

**శాంతినగర్:** బీసీ కులవృత్తిదారులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసాయం వెంటనే అందజేయాలని నాయీబ్రాహ్మణ సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీ కులవృత్తిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి నేటి వరకు ఆర్థికసాయం అందించకపోవడం సరికాదన్నారు. అర్హులైన వారందరికీ ఆర్థికసాయం అందించి కుల వృత్తులను ప్రోత్సహించాలని కోరారు.

### స్వకులశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రామలింగేశ్వర్

**గద్వాల రూరల్:** స్వకులశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గద్వాలకు చెందిన రామలింగేశ్వర్ కామ్లీ ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని స్వకులశాలి భవన్‌లో 33 జిల్లాలకు చెందిన సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గద్వాలకు చెందిన రామలింగేశ్వర్ కామ్లీని రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

### బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



**అలంపూర్ రూరల్:** బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ మహేందర్ అన్నారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద పోలీస్ కళాజాతా బృందంతో సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరచిత వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. మహిళలు, బాలికలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. కాలనీల్లో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రాధమ్మ, కానిస్టేబుల్స్ కృష్ణ, ఆంజనేయులు, షీటీం కానిస్టేబుల్ హన్మంతు పాల్గొన్నారు.

### సెల్‌ఫోన్ అప్పగింత



**ఆత్మకూర్:** నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా చోరీకి గురయిన సెల్‌ఫోన్‌ను రికివరీ చేసి సోమవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. పట్టణంలోని పీజేపీ క్యాంపులో నివాసం ఉంటున్న వెంకటస్వామి నెల రోజుల క్రితం ఆత్మకూర్ సంతలో తన సెల్‌ఫోన్ చోరీకి గురయ్యిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని నిజామాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేసుకున్నారు. సెల్‌ఫోన్లు చోరీకి గురయిన, లేదా పోగొట్టుకున్నా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను పొందుపర్చాలని సూచించారు.

## బీఆర్ఎస్‌తోనే రైతు సుభిక్షం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

**గట్టు:** బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రైతు సుభిక్షంగా ఉంటారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు అండగా ఉంటూ వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలో.. రైతులకు 3 గంటల కరెంట్ ఇస్తే చాలన్న కాంగ్రెస్ పార్టీ కావాలో రైతులే నిర్ణయించుకోవాలన్నారు. 65 ఏళ్ల పాటు వివిధ పార్టీలు పాలిస్తే.. అందులో కాంగ్రెస్ పార్టీ 50ఏళ్లు పాలించిందని, ఆనాడు గ్రామాల్లో తాగునీరు, కరెంట్‌కు ఎన్నో అవస్థలు పడ్డామని గుర్తు చేశారు. తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంతో ప్రతి పల్లెలో ఇంటింటికి తాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. పంటసాగు పెట్టుబడి కోసం ఆనాడు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే పరిస్థితులు ఉండగా.. నేడు పెట్టుబడికి ఇబ్బంది లేకుండా కేసీఆర్ ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల చొప్పున అందిస్తున్నట్లు చెప్పారు. రైతుబీమాతో కుటుంబాలకు భరోసాగా నిలిచినట్లు తెలిపారు. గట్టు ఎత్తిపోతలతో డిసెంబర్ నాటికి సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నల్లమట్టితో పథకం పనులు జోరుగా సాగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ వస్తే మళ్లీ మన బతుకులు చీకట్ల పాలవుతాయన్నారు. రైతాంగానికి 3 గంటల కరెంట్ ఇచ్చే ప్రభుత్వం కావాలో.. మూడు పంటలకు ఉచిత విద్యుత్ ఇచ్చే ప్రభుత్వం కావాలో తేల్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, కేటీదొడ్డి జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్‌ఎంపీపీ రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు రామకృష్ణారెడ్డి, బస్వరాజు, ఆనంద్, వాహెబ్, రామునాయుడు, సంతోష్, కృష్ణ, బజారి, వెంకటేష్, గద్వాల తిమ్మప్ప, వెంకటన్నగౌడ్ పాల్గొన్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



పుస్తకాలు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

**అయిజ:** ఆషాడమాసం గురుపౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం మండలంలోని పులికల్‌లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక బింగుదొడ్డి కమిటీ సభ్యులు లక్ష్మణ్, ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, జయమ్మ, నర్సమ్మ, పద్మమ్మ, జములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అలంపూర్‌లో అభివృద్ధి శూన్యం



కరపత్రాలను విడుదల చేస్తున్న బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయకుమార్

**ఎర్రవల్లిచౌరస్తా:** పాలకుల తీరుతో అలంపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో అట్టడుగున నిలిచిందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయకుమార్ అన్నారు. ఇటిక్యాల మండలం కొండేరులో సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో ధూంధాం నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజనులకు జరుగుతున్న అన్యాయంపై కళాకారులు ఆటపాటలతో వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు హామీల పేరుతో ప్రజలను నట్టేట ముంచుతున్నాయన్నారు. ఓట్లను దండుకోవడం కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నీటిమూటలుగానే మారుతున్నాయన్నారు. అర్హులందరికీ పథకాలు అందకపోవడంతో ఎన్నో కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బంగారు తెలంగాణలో కనీసం విద్య, వైద్యం అందని పరిస్థితి ఉందన్నారు. పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందాలంటే రాష్ట్రంలో బహుజన రాజ్యం రావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆర్ఎస్పీని ఆదరిస్తే బహుజనుల జీవితాలు బాగుపడతాయన్నారు. అనంతరం మన ఆర్ఎస్పీ ఇప్పుడు సీఎం అభ్యర్థి అనే కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో బహుజన కళావేదిక బృందం సభ్యుడు శ్రీకాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు తిరుపాల్, ఇంచార్జ్ మధుగౌడ్ పాల్గొన్నారు.

## అమరచింత ఎస్ఐగా జగన్మోహన్

**అమరచింత:** నూతన ఎస్ఐగా జగన్మోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నారాయణపేటలో స్పెషల్ బ్రాంచి ఎస్ఐగా విధులు నిర్వహించిన ఆయన అమరచింతకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎస్ఐని కలిసి శాలువాతో సన్మానించారు.